# మర్డర్



“ఏమండీ... భోంచేద్దాం రండి!”

“అలాగే...”

భర్త ఎంతసేపటికీ రాకపోవడంతో సిటౌట్‌లో కొచ్చిన రాధ- సదాశివం చేతిలోని ఉత్తరం చూసి, “ఇది పదోసారి అనుకుంటా... మీరు ఆ ఉత్తరాన్ని చదవడం!” అంది నవ్వుతూ.

సదాశివం కూడా నవ్వుతూ "అవునోయ్ఁ... మరి, నా కథకు బహుమతి వచ్చిన విషయం తెలిపిన ఉత్తరం ఇది. అందుకే ఎన్నిసార్లు చదివినా తనివితీరడం లేదు" అన్నాడు.

రాధ నిజమేనన్నట్లు తలూపింది. సదాశివం కథలు చాలా పత్రికల్లో అచ్చయ్యాయి గానీ, పోటీలో బహుమతి పొందడం ఇదే మొదటిసారి.

"భోజనమయ్యాక ఎన్నిసార్లయినా చదువుకుందురు గాని... పదండి!"

తప్పదన్నట్లు భార్యను అనుసరించాడు సదాశివం.

భోజనాలయ్యాక సిటౌట్‌లో కూర్చుని ఎదురుగా ఉన్న బంగళా వైపు చూడసాగాడు సదాశివం.

సినీ నటి సులేఖ నివాసమది!

బంగళా పూర్తిగా కనబడటం లేదు. ఎత్తైన ప్రహరీ, ఏపుగా పెరిగిన చెట్లు బంగళాను చాలావరకు కనిపించకుండా చేస్తున్నాయి.

"మీ కథకు బహుమతి వచ్చినందుకు ముందుగా మీరు సులేఖగారికి థాంక్స్ చెప్పాలి. ఆ కథ రాయడానికి ఇన్‌స్పిరేషన్ ఆవిడ, ఆవిడ బంగళాయే కదా!"

"అవును. 'ఒంటరిగా ఓ స్త్రీ అంత పెద్ద బంగళాలో ఎలా ఉంటుందా..?' అని ఆలోచిస్తూండేవాణ్ణి. అఫ్‌కోర్స్ఁ... పనివాళ్ళున్నారనుకో! కాని, సొంత మనుషులంటూ ఎవరూ లేరు ఆమెకి. నౌకర్లకు ఒక్కక్షణం బుద్ధి మారినా చాలు- ఆమెను చంపి నగలూ, డబ్బా దోచుకెళ్లడానికి. ఇలా ప్రతిరోజూ ఇక్కడ నిలబడి ఆలోచిస్తూంటే ఆ కథకు ప్లాటు స్ఫురించింది. మంచి ట్రీట్‌మెంట్ ఇచ్చాక అద్భుతమైన కథగా తయారైంది. అయితే ఇందులో నీ వంతు సాయం కూడా ఉందిగా!"

"నాదేముంది? ఆలోచన మీది, కష్టం మీది. అద్భుతంగా రాసిన ఘనత మీది. ఎంతైనా చెయ్యి తిరిగిన రచయిత మీరు."

"లేదు. నా చెయ్యి నిటారుగా ఉంది... చూడు!" చేతిని చూపిస్తూ అన్నాడు సదాశివం.

రాధ నవ్వింది.

●

బైనాక్యులర్స్ నుంచి సులేఖ ఇంటివైపు చూస్తున్న సదాశివం తన భుజాలపై చేయి పడడంతో ఉలిక్కిపడి తల తిప్పి చూశాడు.

రాధ నిలబడివుంది.

"అర్ధరాత్రి ఒంటిగంటకు ఇదేం పనండీ?" అంది విసుగ్గా.

"ష్ఁ... మెల్లిగా మాట్లాడు. నాకు నిద్రపట్టకపోతే లేచి సిటౌట్‌లోకి వచ్చాను. సులేఖగారి ఇంటి కాంపౌండ్‌లో ఎవరో తచ్చాడుతున్నట్టు అనిపించింది. మన నందూ అమెరికా నుంచి తెచ్చిన బైనాక్యులర్స్ గుర్తొచ్చి అందులోంచి చూశాను. ఎవరో మగవ్యక్తి కుడిపక్కనున్న ప్రహరీ గోడ దూకి రోడ్డుమీద తాపీగా నడుచుకుంటూ వెళ్లిపోయాడు. అతని ముఖం నాకు పరిచయమైనదే అనిపిస్తోంది. ఎక్కడో చూశానతన్ని రాధా! ఐ సస్పెక్ట్ సమ్‌థింగ్ రాంగ్!" ఆందోళనగా అన్నాడు సదాశివం.

"ఎవర్ని చూసి ఎవరనుకుంటున్నారో?! అర్థరాత్రి వేళ నిద్ర మానుకుని ఎందుకీ పోలీసు డ్యూటీ? పడుకుందాం రండీ!" చెయ్యిపట్టి లేపింది రాధ.

●

"ఏమండీ... లేవండి! సులేఖ ఇంటినిండా జనం, పోలీసులు ఉన్నారు!" సదాశివాన్ని నిద్రలేపుతూ అంది రాధ.

ఉలిక్కిపడి లేచిన సదాశివం- "నువ్వు చెప్పింది నిజమా?" అని అడిగాడు.

"అవునండీ! రండి... చూద్దురు!"

సదాశివం సిటౌట్‌లో కెళ్లి బయటకు చూశాడు. సులేఖ ఇంటిముందు రెండు పోలీస్ జీప్‌లు నిలబడివున్నాయి. గేటు వెలుపల జనం ఉన్నారు.

వెంటనే దుస్తులు మార్చుకుని బయటకు వెళ్లాడు సదాశివం. అరగంట తర్వాత ఇంట్లోకి వచ్చాడు.

"ఏమైందండీ..?" రాధ అడిగింది.

"సులేఖను ఎవరో హత్య చేశారు!" బాధగా అన్నాడు సదాశివం.

ఆశ్చర్యంగా నోరు తెరిచింది రాధ.

తర్వాత టీవీ ఆన్ చేసి, వార్తలు చూడసాగారు ఇద్దరూ. అన్ని ఛానల్స్‌లో సులేఖ హత్య గురించిన వార్తలే ప్రసారం కాసాగాయి. చూస్తున్న ఇద్దరూ షాక్ తిన్నవారిలా కూర్చుండిపోయారు.

సదాశివం 'మర్డర్' కథలో రాసిన విధంగానే హత్య చేయబడింది సులేఖ.

●

"నా కథలో రాసినట్టే ఆమె హత్య జరగడం, హంతకుడు నేను కథలో ఉపయోగించిన ట్రిక్‌నే ఉపయోగించడం నన్ను కలవరపరుస్తోంది. ఆ కథ అచ్చు కాకున్నా బాగుండేది. తిరిగొచ్చుంటే గుట్టుగా ఫైల్ చేసివుందును. ఇంకో వారంరోజుల్లో కథ ప్రచురితమవుతుంది. అప్పుడు పోలీసులే కాదు, పాఠకులందరూ కూడా ఈ హత్యలో నాకు భాగం ఉందనుకుంటారు!" అన్నాడు భార్యతో సదాశివం.

"అలా ఎందుకనుకుంటారండీ! మీ గురించి ఎవరికి తెలియదు? కథ ప్రచురించాక హత్య జరిగుంటే మీ కథ చదివి హంతకుడు అలాగే హత్య చేశాడనీ, హత్యకు నైతికబాధ్యత మీదేననీ అనేవారు. ఒకవిధంగా కథ ఇంకా ప్రచురణ కాకపోవడం మన మంచికే అయింది!" అంది రాధ అతనికి ధైర్యం చెబుతూ.

"చూద్దాం! జరుగనున్నది జరగక మానదు. అన్నిటికీ సిద్ధంగా ఉండాలి!" చిన్నగా నిట్టూర్చి అన్నాడు సదాశివం.

మరుసటి వారమే అతని కథ ప్రచురితమైంది. వెంటనే అతనికి ఉత్తరాలు రావడం మొదలయ్యాయి. కొందరు కథ అద్భుతంగా ఉందని రాస్తే- చాలామంది కథను, సులేఖ హత్యను పోలుస్తూ రాశారని వ్యాఖ్యానించారు.

వారంరోజుల తర్వాత... ఆఫీసులో తన సీటు ముందు కూర్చునివున్న పోలీసాఫీసరును చూసి కంగారుపడ్డాడు సదాశివం. సీట్లో కూర్చుని, "మీరు..." అన్నాడు.

"శ్రీకాంత్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్! సదాశివం అంటే మీరేనా?"

"అవును... నమస్తే!" అంటూ కరచాలనం చేశాడు సదాశివం.

"మీ 'మర్డర్' కథ చదివాను. చాలా బాగుంది!"

"థాంక్స్!"

"సినీ నటి సులేఖ గారి హత్యకేసు డీల్ చేస్తున్నది నేనే!"

"ఐ సీ..."

"ఈ కేసు విషయంలో మీరు మాకు సహకరించాలి."

"ఇందులో నేను చేయదగ్గ సహాయం ఏముంటుంది?"

"ఉంది. ఈ హత్యకు ప్లాను రచించింది మీరే కదా!"

"కాదు. నేను కథ రచించాను... అంతే! కథలో రాసినట్టు హత్య జరగటం యాదృచ్ఛికం!"

"కావచ్చు. ఆ విషయం నేను కన్‌ఫర్మ్ చేసుకోవాలి. అందుకు మీ సహకారం కావాలి."

"తప్పకుండా! అది నా బాధ్యత కూడా!"

"వెరీగుడ్! నేను సాయంత్రం మీ ఇంటికొస్తాను. మనం అక్కడ మాట్లాడుకుందాం. ఆఫీసులో మాట్లాడుకోవడం మీకు ఇబ్బందిగా అనిపించవచ్చు!"

"నా అడ్రస్ తెలుసా మీకు?"

"తెలుసు. పత్రికలో వేశారుగా! సులేఖ గారి ఇంటికి దగ్గర్లోనే ఉన్నట్లున్నారు మీరు?!"

"ఆవిడ ఎదురింట్లోనే ఉంటున్నాను. రాత్రిపూట రోజూ ఆవిడ ఇంటివైపే చూస్తూండేవాణ్ణి. అలా చూస్తుంటే దొరికింది నా కథకు ప్లాటు."

"అలాగా..." అంటూ నవ్వి, "నేను ఉంటాను. ఈరోజు సాయంత్రం మీ ఇంట్లో కలుస్తాను" అంటూ వెళ్లబోయి, మళ్లీ తిరిగొచ్చి- "మీరు మరీ టెన్షన్ ఫీల్ కాకండి. మా రొటీన్ ఎంక్వయిరీలు మేము చేస్తుంటాం. మా టార్గెట్ అసలు హంతకుడే తప్ప మీలాంటి వాళ్ళను యిబ్బంది పెట్టడం మాకూ ఇష్టం ఉండదు" అన్నాడు శ్రీకాంత్.

సదాశివం ముఖంలో టెన్షన్ మాయమైంది.

"ఈ కేసు విషయంలో నా పూర్తి సహకారాన్ని మీకు అందిస్తాను..." అన్నాడు.

●

"మీ కథను మీరు పత్రికకు పంపకముందు ఎవరికైనా చెప్పారా?"

-శ్రీకాంత్ సదాశివాన్ని అడిగాడు.

"నా భార్యకు చెప్పాను."

"ఇంకెవరికి చెప్పారు?"

సదాశివం తటపటాయించడం చూసి, "ఫర్వాలేదు... చెప్పండి. మావల్ల వారికి ఏ ఇబ్బందీ రాదు" అన్నాడు శ్రీకాంత్.

"నా మిత్రుడు బాలాజీకి చెప్పాను. ఆ విషయం మీతో చెబితే అతన్ని ఎంక్వయిరీ అంటూ ఇబ్బంది పెడతారేమోనని చెప్పడానికి తటపటాయించాను. అతను చాలా భయస్తుడు. పోలీసు ఎంక్వయిరీలంటే భయపడతాడు. పైగా, అతన్ని ఇందులోకి లాగినందుకు నన్ను కోప్పడవచ్చు కూడా!"

"మీకు ఆ భయం అక్కర్లేదు. మీరు కథను ఎక్కడ చెప్పారు అతనికి?"

"రైల్లో!"

"రిజర్వ్‌డ్ కంపార్ట్‌మెంట్‌లోనా?"

"కాదు. జనరల్ కంపార్ట్‌మెంట్‌లో. విజయవాడ నుంచి హైదరాబాద్ వస్తున్నాం ఓరోజు. పగటిపూట జర్నీ కాబట్టి జనరల్ కంపార్ట్‌మెంట్‌లో వచ్చాం."

"రిజర్వ్‌డ్ కంపార్ట్‌మెంట్ అయివుంటే అందులో మీతో పాటు మీ కూపేలో ప్రయాణించిన వారి పేర్లను రైల్వే రికార్డుల ద్వారా తెలుసుకుని వారి గురించి ఎంక్వయిరీ చేసివుంటే హంతకుడు దొరికే అవకాశం ఉండేది. జనరల్ కంపార్ట్‌మెంట్ అంటున్నారు కాబట్టి- ఆ అవకాశం లేదు. పోనీ, కంపార్ట్‌మెంట్‌లో మీరు కథ చెబుతున్నప్పుడు మీ ఫ్రెండ్‌తో పాటు ఆసక్తిగా విన్నవాళ్ళు ఉన్నారా?" అని అడిగాడు శ్రీకాంత్.

కొన్ని క్షణాలు ఆలోచించి, "ఎస్... ఐ గాటిట్!" అన్నాడు భార్య వైపు చూస్తూ. అతని ముఖం ఎగ్జయిట్‌మెంట్‌తో నిండివుంది.

"ఏమైంది?" శ్రీకాంత్ అడిగాడు.

"చెబుతాను. అంతకుముందు మీకో విషయం చెప్పాలి. హత్య జరిగినరోజు రాత్రి నిద్రపట్టక సిటౌట్‌లోకొచ్చాను. సులేఖ గారి ఇంట్లోంచి ఓ వ్యక్తి గోడ దూకుతుంటే అనుమానమేసి నా బైనాక్యులర్స్ తీసి అందులోంచి చూశాను. అతన్ని ఎక్కడో చూసినట్లనిపించింది. ఆ విషయం పక్కనున్న నా భార్యతో అప్పుడే అన్నాను."

"ఎన్ని గంటలకు చూశారు ఆ వ్యక్తిని?"

"రాత్రి ఒంటిగంటకు!"

"ఆ సమయంలో మీరు అక్కడెందుకున్నారు?" రాధను అడిగాడు శ్రీకాంత్.

"దాహంగా అనిపించి మెలకువ రావడంతో లేచి, పక్కన ఆయన లేకపోవడంతో కంగారుపడ్డాను. పైగా, హాలు తలుపు తెరచివుంది. భయపడుతూనే సిటౌట్‌లోకి వచ్చి చూస్తే- ఈయన బైనాక్యులర్స్‌తో సులేఖ గారి ఇంటివైపు చూస్తూండటం కనిపించింది. నాకు చిరాకు వేసింది... ఆయన అర్ధరాత్రి అలా నిలబడి చూస్తూంటే! అప్పుడు ఆయన చెప్పారు- ఓ వ్యక్తి సులేఖగారి ఇంటినుంచి బయటకు వచ్చాడనీ, అతన్ని ఎక్కడో చూసినట్టు ఉందనీ!" అంది రాధ.

"'మీరు రైల్లో ఆ కథని ఎవరైనా విన్నారా?' అని అడిగితే గుర్తొచ్చింది. ఆరోజు రైల్లో మాతో పాటు ప్రయాణించిన వ్యక్తే సులేఖ గారి ఇంటినుంచి బయటకు వచ్చింది!" అన్నాడు సదాశివం.

"క్వైట్ ఇంటరెస్టింగ్! రైల్లో మీరు అతనితో మాట్లాడటం కానీ, అతని గురించి వివరాలు తెలుసుకోవడం గానీ జరిగిందా?" అడిగాడు శ్రీకాంత్.

"లేదు..."

కొంతసేపు సదాశివాన్ని వివిధ రకాలుగా ప్రశ్నించిన శ్రీకాంత్- తర్వాత కలుస్తానని చెప్పి వెళ్లిపోయాడు.

●

నాలుగు రోజుల తర్వాత సదాశివాన్ని ఆఫీసులో కలిశాడు శ్రీకాంత్.

"రండి... కాఫీ తాగుతూ మాట్లాడుకుందాం!" అంటూ బయటకు దారితీశాడు సదాశివం.

ఆఫీసుకు ఎదురుగా ఉన్న హోటల్‌లో ఫ్యామిలీ రూమ్‌లో కూర్చున్నాక కాఫీకి ఆర్డర్ చేశాడు సదాశివం. తర్వాత శ్రీకాంత్ వైపు తిరిగి-

"ఎనీ బ్రేక్ ఇన్ ద కేస్?" అని అడిగాడు.

అవునన్నట్టు తలూపాడు శ్రీకాంత్.

"హంతకుడు దొరికాడా?" ఎగ్జయిట్‌మెంట్‌తో అడిగాడు సదాశివం.

"దొరకబోతున్నాడు..."

"ఎలా?"

"హంతకుడు సులేఖగారిని హత్య చేయడం ఓ పేపర్‌బాయ్ చూశాడు."

"అర్ధరాత్రి జరిగిన హత్యను పేపర్‌బాయ్ చూడటం ఎలా సాధ్యం?"

"చెబుతాను. హత్య జరిగిన రోజు సాయంత్రం ఆ పేపర్‌బాయ్ ఈవెనింగ్ ఎడిషన్ పేపర్ సులేఖగారి ఇంట్లో వేయడానికి వెళ్లాడు. వాచ్‌మన్ గేట్ దగ్గర కనిపించకపోవడంతో ఇంటి లోపలికి వెళ్లిన అతను ఇంట్లో కూడా ఎవరూ కనిపించకపోవడంతో మేడమ్ గది వరకూ వెళ్లాడు. అక్కడా ఎవరూ లేకపోవడంతో అతనికి ఆశ పుట్టింది. గదిలోకి వెళ్లి డబ్బు, నగలూ ఏది దొరికితే అది జేబులో వేసుకుందామని లోపలికి అడుగుపెట్టాడు. ఇంతలో... సులేఖగారు బాత్‌రూమ్ లోంచి బయటకు రావడంతో ఓ బీరువా వెనుక దాక్కున్నాడు. ఆమె అక్కడ్నుంచి కదలకపోవడంతో అక్కడే అర్ధరాత్రి వరకూ ఉండిపోయాడు. హంతకుడు రావడం, సులేఖగారిని చంపడం... కళ్ళారా చూశాడు. భయంతో స్పృహతప్పి పడిపోయాడు. తెల్లవారుఝామున లేచి ఇంటికి వచ్చాడు. హత్యను చూసిన షాక్ వల్ల ఇంట్లో పిచ్చిపిచ్చిగా మాట్లాడసాగాడు. తండ్రి సైకియాట్రిస్ట్ దగ్గరికి తీసుకెళ్లి ట్రీట్‌మెంట్ ఇప్పిస్తే మామూలు మనిషయ్యాడు. తర్వాత ఆ సైకియాట్రిస్ట్ సలహా మీద తండ్రీకొడుకులిద్దరూ నన్ను కలిశారు."

"ఓ సినిమా కథ వింటున్నట్లుంది నాకు. ఓ.కే... మీ నెక్స్ట్ మూవ్ ఏమిటి?"

"హంతకుడు తాను ఇదివరకు చూసిన వ్యక్తేననీ, తను పేపర్ ఎవరి ఇళ్లకు డెలివరీ చేస్తాడో ఆ ఇళ్లలో నివసించే వ్యక్తులందరినీ తనకు చూపిస్తే హంతకుణ్ణి చూపించగలననీ అన్నాడు. అతని ఉత్సాహం చూసి నాకు చాలా సంతోషం వేసింది. ఈ ఆదివారం సాయంత్రం సులేఖగారి ఇంటి చుట్టుపక్కల నివసించే వారినందరినీ వీధిలో హాజరు కావాలని విజ్ఞప్తి చేస్తున్నాం. మీరూ మాకు సహకరించాలి."

"తప్పకుండా! అయితే రేపు మేము తిరుమల వెళ్తున్నాం. చాలారోజులుగా అనుకుంటూ ఫిక్సయిన ప్రోగ్రాం ఇది. శనివారం సాయంత్రానికల్లా తిరిగొచ్చేస్తాం."

"అలాగే..."

●

ఆదివారం సాయంత్రం మేడ దిగి వీధిలోకి వచ్చారు సదాశివం, రాధ.

అప్పటికి దాదాపు యాభైమంది మాత్రమే అక్కడికి చేరి ఉన్నారు. పోలీసులు అందరినీ వరుసలో నిలబెడుతున్నారు. ప్రెస్‌వాళ్ళు, టీవీ ఛానల్ వాళ్ళు తమ కెమెరాలతో సిద్ధంగా ఉన్నారు.

ఇంతలో... పోలీసు జీపు వచ్చి ఆగింది. శ్రీకాంత్‌తో పాటు ఓ పన్నెండేళ్ల కుర్రాడు జీపు దిగాడు. అందరూ అతన్నే ఆసక్తిగా చూడసాగారు. అతను వరుస మొదటినుంచి ఒక్కొక్కరినీ చూసుకుంటూ రాసాగాడు. సదాశివంను చూడగానే హిస్టీరిక్‌గా మారిపోయాడు.

"ఇతడే... ఇతడే... మేడమ్‌ని చంపిన వ్యక్తి ఇతడే!" అంటూ అరవసాగాడు.

శ్రీకాంత్ కంగారుగా, "బాలూ... తప్పు! ఆయన పెద్దమనిషి. మంచి రైటర్. ఆయన్ని అవమానించకూడదు. నీకు ఆరోగ్యం బాగా లేకుంటే ఇంకో రోజు వద్దాం... పద!" అన్నాడు.

"కాదు... ఇతడే... నా కళ్ళారా చూశాను."

"సదాశివంగారూ! కోర్టులో బాలు చెప్పింది బలమైన సాక్ష్యం అవుతుంది. నిజం చెప్పండి... సులేఖను చంపింది మీరేనా?" అన్నాడు శ్రీకాంత్ అతని కంఠంలో కఠినత్వం ధ్వనించింది.

సదాశివం మౌనంగా ఉండిపోయాడు.

"చెప్పండి... సులేఖను చంపింది మీరేనా?" మళ్లీ అడిగాడు శ్రీకాంత్.

అవునన్నట్లు తల నిలువుగా ఊపాడు సదాశివం.

●

"ఆ అబ్బాయి నన్ను గుర్తుపట్టకూడదని తిరుమలకు వెళ్లి గుండు గీయించుకుని వచ్చాను. తలపై జుట్టు, మూతిపై మీసాలు లేకున్నా ఆ అబ్బాయి నన్ను ఎలా గుర్తుపట్టాడో నాకర్థంకావడం లేదు" వారంరోజుల తర్వాత జైలులో తనను కలిసిన శ్రీకాంత్‌తో అన్నాడు సదాశివం.

"బాలు హత్యను కానీ, హంతకుడిని కానీ చూడలేదు. అసలతను పేపర్‌బాయ్ కానే కాదు."

"మరి..?" ఆశ్చర్యంగా చూశాడు సదాశివం.

"మా చెల్లెలి కొడుకు. సినిమాల్లో ఛాన్సుల కోసం ప్రయత్నిస్తున్న బాలనటుడు. జీపు దిగకముందే వాడికి మిమ్మల్ని చూపించి హంతకుడిగా గుర్తించమని చెప్పాను..." అన్నాడు శ్రీకాంత్.

"నామీద మీకెందుకు అనుమానం వచ్చింది?"

"చెబుతాను. సులేఖగారికి మీరు తన ఎదురింట్లో ఉన్నారన్న విషయం తెలుసా?"

"తెలియదు."

"కాదు... తెలుసు! ఓరోజు వినాయక చవితి చందాల కోసం మీ ఇంటికి వచ్చినవారు తర్వాత సులేఖగారి ఇంటికి వెళ్లారు. వాళ్ళ రిసీట్ బుక్ వెనక్కి తిప్పి చూసిన ఆమెకు మీ సంతకం, పేరు, అడ్రస్ కనిపించాయి. వాళ్ళను ఎంక్వయిరీ చేసి మీరు ఎదురింట్లోనే ఉంటున్న విషయం తెలుసుకున్నారు. ఆ విషయం తన డైరీలో రాసుకున్నారు. మీనుంచి తన ప్రాణానికి ఆపద ఉందన్న విషయం కూడా రాసుకున్నారు. ఆ డైరీ ఆమె వార్డ్‌రోబ్‌లో దొరికింది మాకు."

సదాశివం ఏదో ఆలోచిస్తూ ఉండిపోయాడు.

"ఇప్పుడు మీరు చెప్పండి... ఓ స్త్రీని అంత నిర్దాక్షిణ్యంగా ఎలా చంపగలిగారు? ఎందుకు చంపారు?" అడిగాడు శ్రీకాంత్.

"నేను ఓ సినిమాకు ఘోస్ట్‌రైటర్‌గా పనిచేస్తున్నప్పుడు ఎక్స్‌ట్రా ఆర్టిస్టుగా పరిచయమైంది సులేఖ. నేను ఆమెని హీరోయిన్‌ని చేస్తానని మాటిచ్చి లోబరచుకున్నాను. ఆమెకు సినిమా ఛాన్సుల కోసం సిన్సియర్‌గానే ప్రయత్నించసాగాను. అయితే, అవకాశాలు రాలేదు. ఇంతలో... సులేఖ మరో కుర్రాడితో ప్రేమాయణం మొదలుపెట్టింది. అతను డబ్బున్నవాడు. తన సొంత డబ్బుతో ఆమెని హీరోయిన్‌గా పెట్టి సినిమా తీశాడు. ఆ సినిమా హిట్టయ్యింది. అప్పట్నుంచీ ఆమె బిజీ అయిపోయింది. నేను ఆమె ఇంటికి ఎన్నిసార్లు వెళ్లినా నాతో సరిగా మాట్లాడేది కాదు. కనీసం ఓ స్నేహితుడిగా కూడా నన్ను ట్రీట్ చేయలేదు.

ఓరోజు నేను ఆవేశంతో గొడవపడితే తన ప్రియుడితో నన్ను కొట్టించింది. అప్పట్నుంచీ రోజూ ఆమెకి ఫోన్ చేసి, ముఖంపై యాసిడ్ పోస్తాననీ, చంపేస్తాననీ బెదిరించసాగాను. ఆమె ఆ విషయం తన ప్రియుడితో చెప్పింది. అతను రౌడీల్ని పంపి నన్ను కొట్టించాడు. ఆరు నెలలు పడక నుంచి లేవలేకపోయాను. తర్వాత నాకు ఉద్యోగం వచ్చింది. పెళ్ళిచేసుకుని జీవితంలో స్థిరపడ్డాను. అయితే ఆరు నెలలు నేను అనుభవించిన నరకం నన్ను ఆమెను మరచిపోనివ్వలేదు. నాలోని పగ చల్లారలేదు.

అయిదేళ్లు గడిచాయి. నామీద జరిగిన దాడిలో నా వెన్నెముక దెబ్బతినడం వల్ల నాకు పిల్లలు పుట్టలేదు. అది నాలోని పగకు ఆజ్యం పోసింది. సమయం కోసం ఎదురుచూడ సాగాను. ఈలోగా పత్రికల్లో నా కథలు తరచూ వచ్చేవి. మంచి రచయితగా గుర్తింపు తెచ్చుకున్నాను. సులేఖ ప్రియుడు ఈమధ్యే విమాన ప్రమాదంలో మరణించాడు. అతనితో గడిపిన ఆ ఇంట్లో అతను లేకుండా ఉండలేక, సిటీకి దూరంగా ఉన్న బంగళాకి మారింది సులేఖ. ఆ విషయం తెలుసుకున్న నేను ఆమె ఎదురిల్లు ఖాళీగా ఉండటం చూసి అందులో చేరిపోయాను.

వాచ్‌మన్, నౌకర్ల కళ్ళుగప్పి ఆమె ఇంట్లోకి ప్రవేశించి, నామీద అనుమానం రాకుండా ఆమెను చంపడమెలాగో ఎంత ఆలోచించినా తోచలేదు. వెంటనే నాకు అలవాటైన రూట్లో వెళ్లాను. ఓ 'మర్డర్' కథ కోసం ప్లాటు ఆలోచించాను. అద్భుతంగా కథ తయారైంది. నా సమస్యకు పరిష్కారం దొరికింది. కథలో ఉన్నట్లే ఇంప్లిమెంట్ చేశాను."

"కానీ, మీరు కథను పత్రికకు పంపకుండా ఉండివుంటే ఆ కథ ప్రచురింపబడేది కాదు. మేము మిమ్మల్ని కలిసేవాళ్ళం కాదు. కథను పోటీకి పంపి, మీ అంతట మీరే మా దృష్టిలో పడుతున్నారన్న ఆలోచన మీకు రాలేదా?" అని అడిగాడు శ్రీకాంత్.

"నిజానికి ఆ కథను పోటీకి నేను పంపలేదు."

"మరి..?" ఆశ్చర్యంగా అడిగాడు శ్రీకాంత్.

"నా భార్య పంపింది. పత్రికలో పోటీ ప్రకటన చూసి 'కథ పంపుతున్నారా?' అని అడిగింది. పంపడం లేదని చెప్పాను. ఆమె నాకు తెలియకుండా తనే ఫెయిర్ చేసి పంపింది. బహుమతి వస్తే నన్ను సర్‌ప్రైజ్ చేసినట్లు ఉంటుందని భావించింది."

"మరి, మీ కథ ప్రచురితమవుతున్న విషయం తెలిశాకయినా మీరు హత్య గురించిన ఆలోచన మానుకోలేదెందుకు?"

"ఇదీ ఒకందుకు మంచిదే అనుకున్నాను. నా కథ గురించి తెలిశాక పోలీసులు నన్ను కలుస్తారు. నా సహకారం ఆశిస్తారు. తరచుగా నన్ను కలుస్తుంటారు. అందువల్ల వాళ్ళ ప్లాన్లు నాకు ముందే తెలుస్తుంటాయి కాబట్టి, జాగ్రత్త పడవచ్చనుకున్నాను. అయితే ఎంతో పకడ్బందీగా వ్యూహం రచించిన నేను చందా కోసం వచ్చినవాళ్ళ విషయంలో అజాగ్రత్తగా వ్యవహరించాను" అన్నాడు సదాశివం.

"తప్పు చేసేవాడు ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా ఎక్కడో ఒకచోట పొరపాటు చేస్తాడు. ఆ పొరపాటే అతన్ని చట్టానికి పట్టిస్తుంది" కఠినంగా అంటూ ముందుకు కదిలాడు శ్రీకాంత్.

'ఈనాడు' దినపత్రిక 'ఆదివారం అనుబంధం' ... 16 జూలై' 2006

తమ రచనలను పుస్తకరూపంలోకి తీసుకురావాలన్న ఆసక్తి, అభిలాష
ఉండికూడా ప్రచురణకి అయ్యే ఖర్చుని చూసి వెనుకంజ వేస్తున్న
వర్ధమాన, అనుభవజ్ఞులైన రచయితలకు ప్రచురణ వ్యయంలో వెసులుబాటును కల్పిస్తూ...

జయంతి పబ్లికేషన్స్

రూపొందించిన ప్రచురణ విధానాల గురించిన పూర్తి వివరాల కోసం
రూ॥ 5/- స్టాంపు అంటించిన కవరును జతపరచి మా అడ్రసుకి వ్రాయండి.